

సాక్షి
వరంగల్
I
బుధవారం । 29 । నవంబర్ । 2023





సాక్షి
వరంగల్
బుధవారం । 29 । నవంబర్ । 2023



గెలిపించండి మీ వెన్నంటే ఉంటాం..
- అమెరికాకు పోతామని చెప్పే కుట్రలను నమ్మొద్దు
- ఎన్నికల ప్రచారంలో యశస్వినిరెడ్డి

-IVలో▶



అభివృద్ధి చూసి ఓటేయండి
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ద్విచక్ర వాహనాల ర్యాలీ

-IVలో▶

గరిష్టం/కనిష్టం
$31^0/21^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రతతో పొడి వాతావరణం ఉంటుంది. సాయంత్రం చలి ప్రారంభం అవుతుంది.

న్యూస్‌రీల్

విద్యార్థినికి కరాటేలో గోల్డ్ మెడల్



పర్వతగిరి: గోవాలో నవంబర్ 18నుంచి 23వ తేదీ వరకు వరల్డ్ పునకోసి చోటాఖాన్ ఆధ్వర్యంలో ఆలిండియా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 585మంది క్రీడాకారులు పాల్గొనగా కల్లెడ ఆర్డీఎఫ్ వనిత అచ్యుతపాయ విద్యాలయ జూనియర్ కళాశాలలో ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతున్న గట్ల మనుశ్రీ కరాటే కటాస్ విభాగంలో గోల్డ్ మెడల్, స్పరింగ్ విభాగంలో సిల్వర్ మెడల్, గ్రాండ్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎ.జనార్ధన్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, ఏఓ ఏకాంబరం, శ్రీలత, శ్రీరామమూర్తి, మధుకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్, దేవేందర్,అశోక్,అనిల్, నాగరాజు, మౌనిక, కమలేష్, మహేష్, కళాశాల అధ్యాపకులు మంగళవారం గోల్డ్ మెడల్ సాధించిన మనుశ్రీని అభినందించారు.

ఇస్రోను సందర్శించిన బిట్స్ విద్యార్థులు

నర్సంపేట రూరల్: నర్సంపేట మండలంలోని బిట్స్ కళాశాలకు చెందిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన సుమారు 110మంది విద్యార్థులు ఇండ్రస్టీయల్ విజిట్స్‌లో భాగంగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), శ్రీహరికోటను సందర్శించారు. దాదాపు 4గంటల పాటు ఇస్రోలో ఉన్న అన్ని విభాగాలను సంస్థకు చెందిన సీనియర్ సైంటిస్టులు రవి కుమార్, వైద్యనాధన్ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

30న కేయూకు సెలవు

కేయూ క్యాంపస్: ఎన్నికల నేపథ్యంలో ఈనెల 30న కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని కళాశాలలు, కేయూ పరిధి అనుబంధ కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు మంగళవారం ఒక సర్క్యూలర్ జారీ చేశారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్స్, మీటింగ్స్, పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

కేయూలో మెస్‌లు బంద్

కేయూ క్యాంపస్: ఓటు హక్కును వినియోగించుకునేందుకు కేయూలోని వివిధ హాస్టళ్ల విద్యార్థులు మంగళవారం స్వస్థలాలకు తరలివెళ్లారు. ఈనేపథ్యంలో క్యాంపస్‌లోని వివిధ హాస్టళ్ల మెస్‌లను మంగళవారం సాయంత్రం నుంచి మూసివేసినట్లు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్య తెలిపారు. డిసెంబర్ 2న మధ్యాహ్నం నుంచి మెస్‌లు తెరుస్తామని ఆయన తెలిపారు. హాస్టళ్లు మాత్రం తెరిచే ఉంటాయని పేర్కొన్నారు

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి



నర్సంపేట: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే సాధ్యమని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నర్సంపేట పట్టణంలో బీజేపీ అభ్యర్థి కంభంపాటి పుల్లారావు (ప్రతాప్) ఆధ్వర్యంలో రోడ్‌షో నిర్వహించారు. వరంగల్ రోడ్డు నుంచి వేలాది మంది కార్యకర్తల నడుమ డప్పు చప్పుళ్ల, కోలాటాలతో భారీ ర్యాలీని నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై విసుగు చెందిన తెలంగాణ ప్రజలంతా మార్పు కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. 2015లో మహారాష్ట్ర సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ మా వద్దకు వచ్చి గోదావరి మిగులు జనాలను తెలంగాణ రైతుల కోసం కావాలంటే 40ఏళ్లుగా ఉన్న నీటి గొడవలను పక్కకు పెట్టి అనుమతులు ఇస్తే మేడిగడ్డ, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని, నాలుగేళ్లలోనే ఆ ప్రాజెక్టు శిథిలావస్థకు చేరి బీటలు వారుతోందని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నేతలు కళ్లెపల్లి ప్రణయ్‌దీప్, వడ్డెపల్లి నర్సింహారాములు, బాల్నె జగన్, రేసు శ్రీనివాస్, గడ్డం ఆంజనేయులు, మనీష్, సందీప్ పాల్గొన్నారు.

ఫడ్నవీస్‌కు స్వాగతం

నర్సంపేట రూరల్: బీజేపీ అభ్యర్థి ప్రతాప్‌రెడ్డి కోసం ప్రచారానికి వచ్చిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు పార్టీ నేతలు మహేశ్వరం గ్రామ శివారులో ఏర్పాటుచేసి హెలిపాడ్ వద్ద ఘనస్వాగతం పలికారు.

విద్య, వైద్యం, పారిశ్రామికం

అభివృద్ధి మొదలైంది.. ఇక ఆగదు
- కాంగ్రెస్‌తో కుంటుపడిన వరంగల్ అభివృద్ధి
- ముున్ముందు నగరానికి ఉజ్వల భవిష్యత్
- పెద్ద ఎత్తున రానున్న ఐటీ, పరిశ్రమలు, యూనివర్సిటీలు
- ఇక్కడి ప్రజల బలంతోనే రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించా
- ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు



వరంగల్‌లోని కాకతీయ వైద్య కళాశాల ఆవరణలో జరిగిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం, అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

హన్మకొండ: ఓరుగల్లులో విద్య, వైద్యం, ఐటీ, పారిశ్రామికీకరణ మొదలైందని, ఇక ఆగదని బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. గతంలో వరంగల్ ప్రజలు తనకు బలాన్నిచ్చారని, ఈ బలంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడపించానన్నారు. మరోసారి తనకు అదే బలాన్ని ఇవ్వాలని కోరారు. మంగళవారం వరంగల్ నగరంలోని కాకతీయ వైద్య కళాశాల ఆవరణలో బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ, తూర్పు అభ్యర్థులు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్‌ను గెలిపించాలని కోరుతూ.. నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం ప్రసంగించారు. కాంగ్రెస్ పాలనలో వరంగల్ అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. అజంజాహి మిల్లును మూసేయడంతో ఆస్తులాన్ని అమ్మిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. తాను వరంగల్ ప్రజలకు ఆ స్థాయికి తగ్గ పరిశ్రమ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో మెగా టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేశానన్నారు. దీంతో లక్ష మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. ఇప్పటికే కొన్ని ఐటీ కంపెనీలు వచ్చాయన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ఐటీ కంపెనీలు, పరిశ్రమలు, యూనివర్సిటీలు, విద్యుత్ సంస్థలు రానున్నాయన్నారు. వరంగల్‌లో పెద్దఎత్తున పాడి పరిశ్రమ ఏర్పాటు చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు చెప్పానన్నారు. నగరంలో దుమ్ముధూళి పోయి బ్రహ్మాండమైన రోడ్లు వచ్చాయన్నారు. కాళోజీ పేరిట వైద్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశానన్నారు. దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్ వరంగల్ ప్రజలు పెంచి పోషించిన బీసీ బిడ్డలని, ప్రజలంతా ఏకమై ఇద్దరిని గెలిపించాలన్నారు. చీఫ్ విప్ అయిన వినయ్‌భాస్కర్ హైదరాబాద్‌లో ఉండాల్సి ఉండగా.. వచ్చి హనుమకొండలోనే, ప్రజల మధ్య ఉంటున్నాడన్నారు. 'ఆటోలపై దాస్యం మా ధైర్యం' అని రాసుకోవడాన్ని తాను చూశానన్నారు. ఎంత ప్రేమ, ప్రజలకు అండగా ఉంటేనే ఇలా రాసుకుంటారన్నారు.

నిరంతర అభివృద్ధి

వరంగల్ అభివృద్ధి మొదలైందని, ఇక ఆగదని సీఎం కేసీఆర్ అన్నారు. గతంలో నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు వచ్చేదని, ఇప్పుడు ప్రతి రోజూ వస్తుందన్నారు. కాజీపేట నుంచి వరంగల్ వరకు రైల్వే లైన్ చాలాదూరం ఉందని, ఈ రైల్వేలైన్‌పై 6 ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు అవసరమని, మళ్లీ అధికారంలోకి రాగానే నిర్మిస్తామన్నారు. 20 అంతస్తులతో అతి పెద్ద సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం జరుగుతుందని, హైదరాబాద్‌లో కూడా ఇంత పెద్ద ఆస్పత్రి లేదని, హైదరాబాద్‌కు వచ్చే రోగులు కూడా ఇక్కడికే రావాల్సి ఉంటుందన్నారు. 14 రకాల రోగాలకు చికిత్సలు అందించనున్నట్లు చెప్పారు. తూర్పు తెలంగాణ ప్రజలందరికీ వైద్యసేవలు అందుతాయన్నారు. సభలో రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణి, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎంపీ పసునూరి దయాకర్, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, నాయకులు బొల్లం సంపత్‌కుమార్, మౌలానా జాహీద్, నాగుర్ల వెంకటేశ్వర్లు, దోనెపూడి రమేశ్ బాబు, రిజ్వానా షమీమ్, మర్రి యాదవరెడ్డి, ఎల్లావుల లలితా యాదవ్, జనార్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన అభ్యర్థులు నరేందర్, వినయ్‌భాస్కర్



సభా వేదికపై నృత్యం చేస్తున్న మహిళా కార్పొరేటర్లు

ప్రజలే నా బలం, బలగం: వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్



హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధి జరుగుతోందని వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. తనను నియోజకవర్గ ప్రజలు వారిలో ఒకరిగా చూసుకున్నారని, నా బలం, బలగం ప్రజలేనన్నారు. సీఎం కేసీఆర్ సహాయంతో గుడిసెవాసులకు పట్టాలిప్పించానన్నారు. ఇంకా కొంతమంది ఉన్నారని, వారికి కూడా ఇప్పించాలని సీఎంను కోరారు. పేద, మధ్య తరగతి వారికి ఇళ్లు కావాలని కోరారు. సీఎం కేసీఆర్ తనపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పుడూ వమ్ము చేయలేదన్నారు. ప్రజలకు సేవకుడిగా పని చేశానన్నారు. మళ్లీ గెలిపించాలని కోరారు.

లారీడ్రైవర్ కుమారుడిని ఈ స్థాయికి తీసుకొచ్చారు : వరంగల్ తూర్పు అభ్యర్థి నన్నపునేని నరేందర్



లారీ డ్రైవర్ కుమారుడినైన తనను ఎమ్మెల్యే స్థాయికి.. సీఎం కేసీఆర్ తీసుకొచ్చారని వరంగల్ తూర్పు అభ్యర్థి నన్నపునేని నరేందర్ అన్నారు. వరంగల్‌ను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని, దీంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. మైనార్టీలకు అవకాశాలు కల్పించాలన్నారు. విద్య, వైద్యంలో వరంగల్‌ను ఉత్తర తెలంగాణకు తలమానికంగా సీఎం కేసీఆర్ నిలిపారన్నారు. తనను మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

సభ సైడ్‌లైట్స్
- మధ్యాహ్నం 1.10 గంటలకు సీఎం కేసీఆర్ సభాప్రాంగణానికి చేరుకున్నారు.
- అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో సభా వేదిక వద్దకు చేరుకున్నారు.
- 1.25 గంటలకు ప్రసంగం ప్రారంభం
- 1.52 గంటలకు ప్రసంగం ముగింపు
- 26 నిమిషాలపాటు ప్రసంగం కొనసాగింది.
- తెలంగాణ ఉద్యమ సమయంలో మానుకోటలో జరిగిన ఘటనను గుర్తు చేసుకుని వీరికి ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు.
- వరంగల్‌కు వన్నె తీసుకొచ్చేలా మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని అమలు చేశామని తెలిపారు.
- రాజముద్రలో కాకతీయ తోరణాన్ని చేర్చామన్నారు.
- తెలంగాణ ఏర్పాటు కావాలని భద్రకాళి అమ్మవారికి మొక్కుకున్నానని, రాష్ట్రం ఆవిర్భవించగానే మొక్కు తీర్చుకున్నానని తెలిపారు.
- వరంగల్ సభ 95వది అని పేర్కొన్నారు.
- నన్నపునేని నరేందర్ వేదికపై నుంచి సభికులకు సాష్టాంగ నమస్కారం చేశారు.
- వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలనుంచి భారీగా జనం తరలివచ్చారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- నేటి నుంచి 4 వరకు 144 సెక్షన్ అమలు
- తనిఖీల్లో రూ.12.33కోట్లు స్వాధీనం
- ఎన్నికల విధులకు 5,700 మంది పోలీసులు
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: కమిషనరేట్ పరిధిలో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లపై వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం సాయంత్రం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి ఎనిమిది శాసనసభ స్థానాలతో పాటు, పొరుగు జిల్లాలకు చెందిన కమిషనరేట్‌లో పాక్షికంగా ఉన్న హుస్నాబాద్, హుజురాబాద్, భూపాలపల్లి నియోజకవర్గాల్లో జరిగే ఎన్నికలకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధి వరంగల్ ఈస్ట్, వరంగల్ వెస్ట్, వర్ధన్నపేట, పరకాల, జనగామ, పాలకుర్తి, నర్సంపేట, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో మొత్తం 1,128 పోలింగ్‌స్టేషన్లలో 2,126 పోలింగ్‌బూత్‌లు ఉన్నాయని, ఈ ఎన్నికల నిర్వహణకు డీసీపీ స్థాయి నుంచి హోంగార్డు వరకు మొత్తం 4వేల మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. 1,700 మందికిపైగా కేంద్ర సాయుధ పోలీసులు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ వెలువడ్డ నాటి నుంచి ఇప్పటి వరకు కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మొత్తం రూ.12.33 కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీంతో పాటు రూ. 55 లక్షల విలువైన మద్యం, గుడుంబా, రూ.10 లక్షల విలువైన ఐదు వందల కిలోల నల్లబెల్లం, పటిక, రూ 1.64 కోట్ల విలువైన 667 కిలోల గంజాయి, ఆరున్నర కిలోల బంగారాన్ని పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. కమిషనరేట్ పరిధిలో 842 కేసులు నమోదు చేసినట్లు సీపీ పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఇప్పటి వరకు 7,842 మందిని ముందస్తుగా అరెస్టు చేయగా.. ఇందులో 579 మంది రౌడీషీటర్లు ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో డీసీపీలు రవీందర్, అబ్దుల్ బారీ, బిఎస్ఎఫ్ కామాండెంట్‌లు హెచ్ఎస్ సాయిని, ముకేశ్‌కుమార్, ఎస్బీ ఏసీపీలు జితేందర్‌రెడ్డి, రమేశ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ప్రశాంత పోలింగ్‌కు సహకరించాలి

- కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రశాతం పోలింగ్‌కు అందరూ సహకరించాలని వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలపై వివరించారు. మంగళవారం సాయంత్రం 5గంటలకు ప్రచారం ముగిసిన నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎటువంటి ప్రచారం నిర్వహించొద్దని, స్థానికేతరులు నియోజకవర్గాలను విడిచి వెళ్లాలని సూచించారు. సోషల్ మీడియా, టీవీలు, రేడియోలు, కేబుల్ నెట్‌వర్క్‌లలో ప్రచారం నిషేధమని, అనుమతి పొందిన ప్రకటనలకు ప్రింట్ మీడియాలో అవకాశం ఉందని తెలిపారు. పోలింగ్ ముగిసిన అరగంట తర్వాత వరకు ఎగ్జిట్‌పోల్స్ నిషేధమని ఓటరు స్లిప్పుల్లో పార్టీల గుర్తులు, అభ్యర్థుల పేర్లు రాయొద్దని, పోలింగ్‌స్టేషన్‌లోకి మొబైల్ ఫోన్ అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలింగ్ సందర్భంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వరంగల్ జిల్లాలో 791 పోలింగ్ స్టేషన్‌లలో 7,56,608 ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. 94,289ఓటరు గుర్తింపు(ఎపిక్)కార్డులకుగానూ ఇప్పటి వరకు 94,285 పంపిణీ చేయడమే కాకుండా 98 శాతం ఓటరు స్లిప్పులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు విధులు నిర్వహించే సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కౌంటింగ్ రూం, స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పోలింగ్ సజావుగా జరిగేందుకు సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇచ్చినట్లు కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ ఆయుబ్‌అలీ, ఎన్నికల పర్యవేక్షకుడు విశ్వనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్ పూర్తి

జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గాలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్‌ల మూడో ర్యాండమైజేషన్ పూర్తయినట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకుడు షణ్ముగరాజన్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ఏర్పాట్ల వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ప్రత్యామ్నాయ గుర్తింపు కార్డుతో ఓటు వేయొచ్చు

ఓటరు గుర్తింపు కార్డు(ఎపిక్ కార్డు) లేకుంటే 12 రకాల ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదానిని చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిక్ కార్డు లేని వారు ఆధార్, ఎంజీఎన్ ఆర్ఈజీఎస్ జాబ్ కార్డు, బ్యాంకు, పోస్టాఫీస్ వారిచే జారీ చేసిన పాస్ పుస్తకాలు, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐ జారీచేసిన స్మార్ట్‌కార్డు, పాస్‌పోర్టు, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పీఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ సంస్థల ఉద్యోగులకు ఫొటోతో జారి చేసిన ఐడీ కార్డు, ఎంపీ, ఎంఎల్‌ఏ, ఎమ్మెల్సీలకు జారీ చేసిన ఐడీ కార్డు, ప్రత్యేక వైకల్యం ఐడీ కార్డులలో ఏదో ఒకటి చూపించి ఓటు వేయొచ్చని సూచించారు. ఈ నెల 30న జరుగనున్న పోలింగ్‌లో పాల్గొని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు.

మైక్‌లు బంద్..

ముగిసిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారం
- ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు నేతల పాట్లు
- ప్రలోభాలను నియంత్రించేందుకు రంగంలోకి ఎన్నికల అధికారులు

సాక్షి, వరంగల్: ఎన్నికల ప్రచారానికి తెరపడింది. ఇన్నాళ్లూ మాటల తూటాలతో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్న అధికార, ప్రతిపక్ష నేతల నోళ్లకు తాళం పడింది. గురువారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచే నాయకుల ప్రచారమైకులు బంద్ అయ్యాయి. దీంతో ఇన్నాళ్లూ తాము గెలిస్తే ఏం చేస్తామంటూ, ఇన్నాళ్లూ జరిగిన అభివృద్ధిని వివరించి, అధికార పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ ప్రతిపక్షాలు జనాల్లోకి వెళ్లి ఓటర్ ను తనవైపునకు తిప్పుకునే పనిచేశారు. ఇక వారి ప్రచారానికి తెరపడడంతో ఎన్నికల్లో కీలకమైన పోల్ మేనేజ్‌మెంట్‌పై ఆయా నేతలు దృష్టి సారించారు. ఆయా గ్రామాల్లో ఉన్న ఓటర్ల జాబితాతో వారికి ఫోన్లు చేస్తూ పోలింగ్ రోజున తప్పనిసరిగా వచ్చి ఓటు వేయాలని కోరుతున్నారు. కొందరు నేతలైతే వారికి రవాణా చార్జీలు ఇచ్చేందుకు కూడా సిద్ధమవుతున్నారు. మరికొందరు నేతలు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు పూనుకున్నట్లు సమాచారం. ఓవరాల్‌గా ఇన్నాళ్లూ మాటల తూటాలు పేల్చిన నేతలు ఇప్పుడు గుట్టు చప్పుడు కాకుండా ఓటర్లను మభ్యపెట్టి తమ పార్టీకి ఓటు వేయించుకునేలా సమష్టిగా పనిచేస్తున్నారు. ఇలా అందరినీ పోలింగ్ కేంద్రం వరకు తీసుకొచ్చి ఓటు వేయించడం ద్వారా తమ పార్టీ గెలవాలన్న పట్టుదలతో పనిచేస్తున్నారు. దీనికి తోడు ఆయా గ్రామాల్లో ప్రలోభాలకు నేతలు తెరలేపారన్న సమాచారంతో ఎన్నికల అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. ఫిర్యాదు అందిన చోటుకు వాలిపోయి తనిఖీలు చేస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులతో కూడిన ఈ బృందాలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా పోలింగ్ సాగేలా కృషి చేస్తున్నారు.

ముఖ్యుల సభలకు వేదికైన వరంగల్

జిల్లాలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ తరఫున అగ్రనేతలు ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, హరీశ్ రావుతోపాటు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఇతర రాష్ట్రాల్లోని కాంగ్రెస్ ముఖ్య నేతలు తమ పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. బీజేపీ తరఫున కేంద్రహోం శాఖ మంత్రి అమిత్ షా, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు ప్రచారం చేశారు. చివరిరోజైన మంగళవారం బీఆర్‌ఎస్ అభ్యర్థుల తరఫున సీఎం కేసీఆర్ ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఇలా ముఖ్యనేతల ప్రచారంతో వరంగల్‌లోని పలు నియోజకవర్గాల్లో త్రిముఖపోటీ నెలకొంది. అన్ని పార్టీల అభ్యర్థులు ఆయా ముఖ్య నేతల ప్రచారంతో తమ గెలుపుపై ధీమాగా ఉన్నారు. ఇలా దాదాపు నెలరోజుల పాటు హాట్ హాట్‌గా సాగిన ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రంతో ముగిసింది.



ప్రచారం పరిసమాప్తం

పోల్ మేనేజ్‌మెంట్‌పై పార్టీల ఆశలు

వరంగల్: ఎన్నికల నిబంధనల మేరకు మంగళవారంతో ప్రచారం ముగిసింది. తూర్పు నియోజకవర్గంలో ఓటర్లను ప్రభావితం చేసేందుకు నజరానాల పంపిణీ మిగిలిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక ఆయా పార్టీల్లో భారీగా చేరికలు జరిగినప్పటికీ దాదాపు వారంతా రెండ్రోజుల్లోనే తిరిగి సొంత పార్టీల్లోకి వచ్చేశారు. స్వచ్ఛందంగా ఇతర పార్టీల్లో చేరిన వారిపై అధికార పార్టీ నేతల బెదిరింపులు, అమ్యామ్యాల అందజేతలతో ఈపు నరాగమం తంతు జరిగినట్లు తెలుస్తోంది. ఇలా.. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు ఆత్మసాక్షితో ఓట్లు వేసే అవకాశాలున్నాయి. ఇలా జరిగితే తూర్పు ఫలితం తారుమారయ్యే పరిస్థితులున్నాయి.

పోల్ మేనేజ్‌మెంట్‌తోనే..

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థి పూర్తిగా పోల్ మేనేజ్‌మెంట్‌పైనే ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. దాదాపు ఆర్నెళ్ల నుంచి నియోజకవర్గంలో డివిజన్ స్థాయిలో కార్పొరేటర్‌తో పాటు ఒక్కో ఇన్‌చార్జ్‌లను నియమించారు. వారి నేతృత్వంలో బూత్ స్థాయిలో ప్రత్యేక బృందంతో ఓటర్ల అభిప్రాయలు సేకరిస్తున్నారు. అనుకూలంగా లేని వారిని ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థి మద్దతుదారులు మునిగిపోయారు.

పెరిగిన క్రేజ్.. కాంగ్రెస్ జోష్

బీఆర్‌ఎస్ హామీలను పూర్తిగా అమలు చేయకపోవడంపై నియోజకవర్గ ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. వివిధ పథకాల్లో లబ్ధి పొందని మెజార్టీ ప్రజలు ఇతర పార్టీల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈనేపథ్యంలో ఎలాగైనా తాను గెలుస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రచారం గురించి పట్టించుకోవడం లేదనే అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి.

అసంతృప్తి.. నిరాడంబరమే ఆయుధాలు

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులపై ఉన్న అసంతృప్తే ఆయుధంగా తూర్పు బీజేపీ అభ్యర్థి ముందుకు సాగుతున్నారు. 2009లో పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓటమి పాలైనప్పటి నుంచి నియోజకవర్గ ప్రజలతోనే ఉండడం బీజేపీ అభ్యర్థికి కలిసొచ్చే అంశంగా స్థానికులు చెబుతున్నారు. బీజేపీ అభ్యర్థి నిరాడంబరతో పాటు ప్రధాని మోదీపై నగరంలోని యువత, వ్యాపార, వాణిజ్య వర్గాలు తమకు పూర్తిగా మద్దతునిస్తున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలనను చూసిన ప్రజలు తమ పార్టీకి ఒకసారి అవకాశం ఇవ్వాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తూర్పు ప్రజలు ఎవరికి మద్దతిస్తారో వేచి చూడాలి.

జంగ్ తెలంగాణ

అభివృద్ధి చూసి ఓటేయండి

గెలిపించండి మీ వెన్నంటే ఉంటాం..



రాయపర్తి: సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు



పాలకుర్తి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి దయాకర్‌రావు

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ద్విచక్ర వాహన ర్యాలీ
- ముగిసిన ఎన్నికల ప్రచారం

పాలకుర్తి: అన్ని గ్రామాల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు ఓటెయ్యాలని ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన సభలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎన్. సుధాకర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడారు. పాలకుర్తి, వల్మిడి, బమ్మెర గ్రామాల్లో కవులు, రచయితలు పేరును నిలబెట్టుకునే విధంగా సుమారు రూ.100 కోట్లతో నూతన భవనాలు నిర్మాణం చేయడం జరిగిందన్నారు. తాను 40 సంవత్సరాలుగా రాజకీయ జీవితంలో ప్రతి రోజు ప్రజల పనుల కోసం పని చేస్తున్నానని, ప్రజలు ఈ విషయం గమనించి తిరిగి ఆశీర్వదించాలని కోరారు. పాలకుర్తి మండలంలో మంత్రి దయాకర్‌రావు ఆధ్వర్యంలో 200 ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రెడ్డి, సర్పంచ్ యాకాంతరావు, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

దయాకర్‌రావు సేవలు గుర్తు పెట్టుకోవాలి

నియోజకవర్గంలో మంత్రి దయాకర్‌రావు చేసిన అభివృద్ధి పనులను గుర్తు పెట్టుకొని ఓటు వేసుకోవాలని మంత్రి సతీమణి ఉషాదేవి అన్నారు.

కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దు

రాయపర్తి: కాంగ్రెస్ నాయకుల మాటలు విని మోసపోవద్దని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల సమావేశానికి 30వేల లోపే జనం వచ్చారని, మొన్న తొర్రూరులో కేసీఆర్ సభకు 1.16వేల మంది, పాలకుర్తి హరీశ్‌రావు రోడ్ షోకి 80వేల మందితో హాజరయ్యారన్నారు. వీరంతా అభిమానంతోనే వచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించేలా కార్యకర్తలు ప్రజలకు వివరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల ఇన్‌చార్జి గుడిపూడి గోపాల్‌రావు, బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పార్టీ అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్లా సుధీర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, వైస్‌ఎంపీపీ ఎనగందుల యాకనారాయణ, మండల ప్రధానకార్యదర్శి పూస మధు, వనజారాణి, నర్మద, భూక్య క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సతీమణి ప్రచారం

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును గెలిపించాలని కోరుతూ మండలంలోని తిర్మలాయపల్లి తెట్టికుంట తండాలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సతీమణి ఉషాదయాకర్‌రావు ప్రచారం నిర్వహించారు. అలాగే మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం మండలకేంద్రంలో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

ప్రభుత్వ పథకం అందని ఇల్లు లేదు

పెద్దవంగర: రాష్ట్రంలో ప్రభుత్వ పథకం అందని ఇల్లు లేదని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్ పర్సన్, మంత్రి దయాకర్‌రావు సతీమణి ఉషాదయాకర్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు చిన్నవంగర, గంట్లకుంట గ్రామాల్లో పాలకుర్తి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్ రావు గెలుపు కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిన్నవంగర ఎంపీటీసీ మెట్టు సౌజన్య నగేష్ ఇటీవల మంత్రి హరీశ్‌రావు సమక్షంలో చేరగా అతని అనుచరులు ఉషాదయాకర్‌రావు సమక్షంలో 100 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఉషాదయాకర్‌రావు మాట్లాడారు. నాయకులు ఈదురు ఐలయ్య, రామచంద్రయ్య శర్మ, పాకనాటి సునీల్ రెడ్డి, సోమారెడ్డి, జలగం శేఖర్, విజయ్‌పాల్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దయాకర్‌రావుకు మద్దతు

కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన గోసంగి కులస్తులు బీఆర్ఎస్ నాయకుడు తాళ్లపల్లి యాకయ్య ఆధ్వర్యంలో ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మంగళవారం తమ మద్దతు తెలిపారు.

మరో అవకాశం కల్పించండి

తొర్రూరు: పాలకుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మరోమారు అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో భారీ రోడ్ షో నిర్వహించారు. దయాకర్‌రావుకు మద్దతుగా వేలాది మంది బీఆర్ఎస్ శ్రేణులు వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్ డాక్టర్ సుధాకర్‌రావు, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషా దయాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, ఎంపీపీ చిన్న అంజయ్య, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



తొర్రూరులో రోడ్ షోకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు



తెట్టికుంటతండాలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి దయాకర్‌రావు సతీమణి ఉషాదయాకర్‌రావు



పాలకుర్తిలో రోడ్‌కు హాజరైన పార్టీ శ్రేణులు, ప్రజలు



రోడ్‌షోలో మాట్లాడుతున్న యశస్వినిరెడ్డి

- అమెరికాకు పోతామని చెప్పే కుట్రలను నమ్మొద్దు
- ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి

పాలకుర్తి టౌన్: పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిపిస్తే మీ వెన్నంటే ఉంటానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారానికి చివరి రోజు కావడంతో పాలకుర్తి మండల కేంద్రంలో భారీ ర్యాలీతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం రాజీవ్ చౌరస్తాలో యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పాలకుర్తిలో ప్రజా సేవ చేయడానికి వస్తే మంత్రి దయాకర్‌రావు ఒక ఆడపిల్ల అని చూడకుండా ముప్పుతిప్పలు పెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుర్తిలో కాంగ్రెస్ జెండా, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడం ఖాయమన్నారు. తొర్రూరు మండలం గుర్తూరులో 70 ఎకరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి పాలకుర్తి నిరుద్యోగ యవతకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తామన్నారు. పాలకుర్తి నియోజకవర్గ వాసులు చేతిగుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని, మంత్రిని ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు.

పాలకుర్తిలో జరిగేది కురుక్షేత్ర యుద్ధం

పాలకుర్తిలో జరిగే ఎన్నికలు కురుక్షేత్ర యుద్ధమని, ధర్మం అధర్మం నాయ్యం, అన్యాయం మధ్య జరుగుతున్న ఎన్నికలని టీపీసీసీ సభ్యురాలు, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి అన్నారు. ప్రజల ఆదరణ చూసి మంత్రి దయాకర్‌రావు పెట్టిన ఇబ్బందులను గుర్తుకు చేసుకొని ఝాన్సీరెడ్డి భాగోద్వేగానికి గురై కంటనీరు పెట్టారు. పాలకుర్తి ప్రజలు తమ కుటుంబంపై చూపించిన ప్రేమ అభిమానం గుర్తు చేశారు. పాలకుర్తి ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి యశస్విని రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, నాయకులు పాల్గొన్నారు. పాలకుర్తి మండలం ఈరవెన్ను సర్పంచ్ ముస్కు నిర్మల చంద్రబాబు బీఆర్ఎస్ పార్టీ నుంచి ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

రాయపర్తి: నా కోడలు యశస్వినిరెడ్డిని గెలిపిస్తే మీ వెన్నంటే ఉంటామని, అమెరికాకు తిరిగి వెళ్లిపోతామని చెప్పే కుట్రలను నమ్మొద్దని కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తిర్మలాయపల్లి, జేతురాంతండా గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో తొర్రూరు, ఖమ్మం తదితర నగరాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేశానని మీరు గెలిపిస్తే పాలకుర్తి అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. ఈవీఎం మిషన్ రెండో నంబర్‌లో ఉన్న చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, సరికొండ కృష్ణారెడ్డి, మాచర్ల ప్రభాకర్, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, జినుగు రత్నాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మల్లయ్య, మచ్చ కుమారస్వామి, ఎనగందుల మురళి, శ్రీనివాస్, గుగులోతు విజయ్, యాకూబ్ పాల్గొన్నారు.



తొర్రూరు: ర్యాలీలో మాట్లాడుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి యశస్వినిరెడ్డి



రాయపర్తి: అభివాదం చేస్తున్న ఝాన్సీరెడ్డి

మార్పు కోసం గెలిపించండి

తొర్రూరు: పాలనలో మార్పు కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని, పాలకుర్తిలో ఆడబిడ్డకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి కోరారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో భారీ ప్రచార ర్యాలీ నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, కోలాటాలు, బ్యాండు మేళాలతో కాంగ్రెస్ శ్రేణులు యశస్వినిరెడ్డికి మద్దతుగా హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడిచిన 15 ఏళ్లలో పాలకుర్తికి మంత్రి దయాకర్‌రావు చేసింది శూన్యమన్నారు. ఎమ్మెల్యేగా గెలవగానే పాలకుర్తి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యమిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, డాక్టర్ రాజేందర్‌రెడ్డి, నాయకులు కాకిరాల హరిప్రసాద్, ముత్తినేని సోమేశ్వర్‌రావు, నిరంజన్‌రెడ్డి, పెదగాని సోమయ్య, బాపురెడ్డి, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'పాలకుర్తి' తీర్పు ఆదర్శం కావాలి

కొడకండ్ల: పాలకుర్తి ప్రజలు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు అండగా ఉండి మీరిచ్చే తీర్పు రాష్ట్రానికే ఆదర్శం కావాలని పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి కోరారు. మంగళవారం నర్సింగాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ రెండో వార్డు సభ్యుడు నూనెముంతల ఎల్లగౌడ్, వెంకట్రాములు ఆమె సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా యశస్వినిరెడ్డి మాట్లాడుతూ ముప్పై ఏళ్లకు పైబడి నుంచి తన సొంత గడ్డపై మమకారంతో మా అత్తమామలు రాజేందర్‌రెడ్డిఝాన్సీరెడ్డి అనేక సామాజిక సేవ, అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. పాలకుర్తి ప్రజల అకాంక్షల మేరకు ప్రజలకు ప్రత్యక్ష సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వస్తే ప్రత్యర్థి దయాకర్‌రావు అనేక అడ్డంకులు సృష్టించినా నమ్ముకొన్న వారికి అండగా ఉండాలనే సంకల్పంతోనే వారసురాలిగా తనను బరిలోకి నిల్పిందని, పాలకుర్తిలో జరిగే ధర్మ సంగ్రామంలో ఆడబిడ్డకు ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి మార్క్ చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమనర్సయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రమేష్, వంశీకృష్ణ, పనస రాంధాస్‌గౌడ్, వీర్యానాయక్, యాకూబ్ పాల్గొన్నారు.

రూ.8 లక్షల విలువైన మద్యం పట్టివేత



రాయపర్తి: మండలంలోని కిష్టాపురం క్రాస్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం రూ. 8 లక్షల విలువైన మద్యం పట్టుకున్నామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఓ డీసీఎంలో ఈ మద్యం లభించిందన్నారు. ఈ సరుకు తొర్రూరులోని ఓ వైన్ షాపునకు చెందిందని తెలిపారు. అనంతరం ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కడతారు

పరకాల రూపురేఖలు మార్చిన

- ప్రజలంతా నావైపే
- ప్రత్యర్థులే లేరు
- హ్యాట్రిక్ విజయం సాధిస్తా..
- మెగా టెక్స్‌టైల్ పార్కులో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తా
- 'సాక్షి'తో పరకాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి



SAKSHI INTERVIEW సాక్షి

ఆత్మకూరు: 'నియోజకవర్గంలో ఓవైపు సంక్షేమం..మరో వైపు అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. గత పాలకులు నియోజకవర్గ అభివృద్ధిని గాలికొదిలేశారు. తొమ్మిది సంవత్సరాల పాలనలో అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపెట్టాను. ఈ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచి హ్యాట్రిక్ కొట్టబోతున్న. ప్రజల ఆశీర్వాదం ఉంది.. వారిపై నమ్మకం ఉంది. అభివృద్ధి, సంక్షేమానికే పట్టం కడుతారు. నియోజకవర్గంలో అసలు ప్రత్యర్థులే లేరు. హ్యాట్రిక్ విజయం అనంతరం రెట్టింపు ఉత్సాహంతో సేవ చేసా' అని పరకాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఈమేరకు ఆయన మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు.

ఆయన మాటల్లోనే..

పేదల సంక్షేమమే ఎజెండా..

పేదల సంక్షేమం, అభివృద్ధే ఎజెండాగా బీఆర్ఎస్ పాలన సాగుతోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు నేరుగా అందుతున్నాయి. కేసీఆర్ కిట్ నుంచి మొదలుకొని అనేక పథకాలు పేదలకు అందుతున్నాయి. దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అందిస్తున్నాం. రైతులకు పెట్టుబడి సాయంగా రైతు బంధు అందిస్తున్నాం. తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆహారం అందించే స్థాయికి ఎదిగింది. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సాగునీరు, తాగునీరు అందించి మాట నిలుపుకున్నాం.

ఎక్కడికి వెళ్లినా డబుల్‌రోడ్లు..

ఒకప్పుడు కాలి నడకే శరణ్యమయ్యేది. కానీ ఇప్పుడు నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా డబుల్ రోడ్లు కనిపిస్తాయి. ఆ స్థాయిలో రోడ్ల నిర్మాణాలు చేపట్టి రవాణా సౌకర్యాన్ని మెరుగుపర్చాం. అలాగే గ్రామాల్లో అంతర్గత రోడ్లు పూర్తిస్థాయిలో నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశాం.

పరకాల డివిజన్, మున్సిపాలిటీ..

ప్రజల ఆకాంక్ష మేరకు పట్టణాన్ని మున్సిపాలిటీతో పాటు రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేశాం. నూతన మున్సిపాలిటీ భవనం నిర్మించాం.

రెండు కొత్త మండలాలు..

ప్రజల కోరిక మేరకు నియోజకవర్గంలో రెండు కొత్త మండలాలు ఏర్పాటు చేశాం. దామెర, నడికుడలను మండలాలుగా ఏర్పాటు చేసి పరిపాలనను సౌలభ్యం మెరుగుపర్చాం. కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మించాము.

మెగా టెక్స్‌టైల్ పార్కులో యువతకు ఉద్యోగాలు..

ప్రపంచంలోనే అగ్రగామి సంస్థ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును నియోజకవర్గానికి తీసుకొచ్చాం. దీంతో యువతకు ఎన్నో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాం. ఏ ప్రభుత్వ హయాంలో జరగని అభివృద్ధి కేసీఆర్ సారథ్యంలో జరుగుతోంది. పరకాలలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ధర్మన్న నీ గెలుపు ఖాయం అంటున్నారు.

100పడకల ఆస్పత్రి..

పట్టణంలో 30 పడకల ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా మారుస్తూ నిర్మాణ పనులు మొదలు పెట్టాం. అలాగే గ్రామాల్లోని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పల్లె దవాఖానలకు శ్రీకారం చుట్టాం.

విద్యాసంస్థలు..

పేద, ధనిక అనే భేదం లేకుండా అన్ని వర్గాల పిల్లలు చదువుకునేందుకు గురుకుల పాఠశాలలు, బాల, బాలికల రెసిడెన్షియల్ స్కూళ్లు, పాలిటెక్నిక్ కళాశాలల ద్వారా విద్యనందిస్తున్నాం. సుమారు రూ.13 కోట్లతో డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించాం.

ఒకే వ్యక్తి.. మూడు ఓట్లు

- ఓటరు జాబితా తప్పుల తడక..
- కరీమాబాద్‌లో వెలుగు చూసిన ఘటన

ఖిలా వరంగల్/ వరంగల్ అర్బన్: ఒకే ఇంటి నంబర్.. ఒకే వ్యక్తికి మూడు ఓట్లు ఉన్నాయి. ఈ విషయం వరంగల్ కరీమాబాద్‌లోని ఓ ఓటరు జాబితాలో వెలుగు చూసింది. ఒకే పేరుతో మూడు ఓట్లు ఉండడం వల్ల క్రాస్ ఓటింగ్‌కు ఆస్కారం ఎక్కువగా ఉందని, ఇది కచ్చితంగా రాజకీయ నాయకులే నమోదు చేసి ఉంటారని విశ్లేషకులు చెబుతున్నారు. అధికారుల పరిశీలన, తప్పిదంతోనే ఒకే పేరుతో రెండు, మూడు ఓట్లు వెలుగు చూస్తున్నాయి. వరంగల్ కరీమాబాద్ ఏరియా సాంబయ్య ఆడెపు, తండ్రి లక్ష్మీనర్సయ్య ఇంటి నంబర్ 17-8-48 ఐఓఎఫ్ 1778174 పురుషుడు వయసు 71, మరో ఓటు శాంబయ్య ఆడెపు, తండ్రి లక్ష్మీనర్సయ్య ఇంటి నంబర్ 17-3-48 ఐఓఎఫ్ 2441251 పురుషుడు వయసు 65, మూడో ఓటు సమబయ్య ఆడెపు, తండ్రి లక్ష్మీనర్సయ్య ఇంటి నంబర్ 17-3-48 ఐఓఎఫ్ 1914332 పురుషుడు వయసు 90తో ఓటరు లిస్టులో ఒకే పేరుతో మూడు ఓట్లు వెలుగు చూశాయి. అధికారులు దొంగ ఓట్లను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని మేధావులు, ప్రజలు కోరుతున్నారు. కాగా, ఈ విషయం మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వరంగల్ తూర్పు రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా విచారణకు ఆదేశించారు. దరఖాస్తు దారుడు ఫొటో, వయసు సవరణ కోసం వేర్వేరు పేర్లతో మార్పుల కోసం దరఖాస్తు చేయడంతోనే ఈ సమస్య ఏర్పడిందని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



రాములు (ఫైల్)

టేకుమట్ల: ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని బూర్నపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు ముంజాల రాములు (55) తనకున్న ఒకటిన్నర ఎకరాల వ్యవసాయ భూమిలో వరి, పత్తి పంటలు సాగు చేశాడు. కాగా, ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు వరి పంట పూర్తిగా ధ్వంసమైంది. పత్తి దిగుబడి సరిగా లేక భారీగా నష్టపోయాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం తన ఇంట్లోనే గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి రాములును చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. రాములు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు.

భవనంపై నుంచి పడి ఒకరి మృతి



మోత్యా (ఫైల్)

నర్సంపేట రూరల్ : భవనంపై నుంచి పడి ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాల పాలైన ఘటన నర్సంపేటలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన జర్పుల మోత్యా (65) కొడుకు వైద్యుడు కాగా పట్టణంలోని నర్సంపేట–వరంగల్ ప్రధాన రహదారి సమీపంలోని అతడి ఆస్పత్రి భవనంపై ఇటీవల మరో రెండు అంతస్తులు నిర్మించాడు. ఇంకా నిర్మాణ పనులు కొనసాగుతుండగా మోత్యా, కూలీకి వచ్చిన ధరావత్ చక్రు రెండో అంతస్తు కూలి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మోత్యా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. చక్రును మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. మోత్యా మృతితో మహేశ్వరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు.